

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన విందులో ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్, మార్చి 17, ప్రభాతవార్త** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన అల్పాహార విందులో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, హర్యానా, ఉత్తరప్రదేశ్ కు చెందిన పార్లమెంటు సభ్యులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా, రామ్మోహన్ నాయుడు, ఇతర ఎంపీలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రపంచంలోనే 5వ అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యస్థానంగా భారత్



**నెల్లూరు రూరల్, మార్చి 17, ప్రభాతవార్త** దేశంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం లోకసభలో పలు అంశాలపై ఆయన ప్రశ్నలు వేశారు. శ్రీది సర్వే ప్రకారం దేశం ప్రపంచంలోనే 5వ అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానంగా మారిందన్న విషయం వాస్తవమేనా అని ఆరా తీశారు. అయితే 2020లో 4వ స్థానం నుండి 2022లో 5వ స్థానానికి, 2023లో 9వ స్థానానికి పడిపోయిన కారణంగా ప్రభుత్వం ఈ స్థానాన్ని పదిలం చేసుకోవడానికి, ఈ ర్యాంకును మరింత ముందుకు తీసుకెళ్లేందుకు విధానపరంగా తీసుకుంటున్న చర్యలు, అదనపు మూలధన వ్యయం, దేశీయ డిమాండ్ ఈ విషయంలో ఎంత వరకు సహాయపడతాయో తెలియజేయాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. పిడబ్ల్యూసి 27వ వార్షిక గ్లోబల్ సర్వే ప్రకారం, భారతదేశం ప్రపంచంలో 5వ అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానంగా మారిందన్నారు. అయితే, ప్రైవేట్ సంస్థలు, రేటింగ్ ఏజెన్సీలు, ఇతర ప్రపంచ సంస్థలు ఎప్పటికప్పుడు భారత ఆర్థిక వ్యవస్థపై తమ సొంత అంతర్గత పరిశోధనలను ప్రచురిస్తాయని, భారత ప్రభుత్వ అభిప్రాయాన్ని సూచించవని తెలియజేశారు. భారతదేశంలో దేశ, విదేశీ పెట్టుబడులను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, పిఎం గతిశక్తి, నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రోగ్రామ్, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ని ప్రోత్సహించడం, నేషనల్ సింగిల్ విండో సిస్టమ్, ఇండియా ఇండస్ట్రియల్ ల్యాండ్ బ్యాంక్, ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్, ఎఫ్‌డీఐ విధానం సరళీకరణ వంటివి దేశంలోకి పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడానికి ఉపకరిస్తాయన్నారు. ప్రభుత్వం పెట్టుబడిదారుల స్నేహపూర్వక విధానాన్ని అమలు చేస్తోందని, కొన్ని ముఖ్యమైన రంగాలు మినహా చాలా రంగాల్లో 100 విదేశీ పెట్టుబడులను ఆహ్వానించామన్నారు. దేశంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎఫ్‌డీఐల పరిమితులను పెంచడం, నియంత్రణ అడ్డంకులను తొలగించడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరచడం వంటి చర్యలు తీసుకున్నామన్నారు. కేంద్ర బడ్జెట్ 2025లో బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 74 నుండి 100కి పెంచామన్నారు. మూలధన వ్యయం, బలమైన దేశీయ డిమాండ్ దేశం యొక్క పెట్టుబడి ఆకర్షణను గణనీయంగా పెంచుతాయన్నారు. మౌలిక సదుపాయాలపై చేసే వ్యయం.. వ్యాపార ఖర్చులను తగ్గించి, ఉత్పాదకతను మెరుగుపరుస్తుందన్నారు. అందుకే కేంద్ర బడ్జెట్ 2025 ప్రకారం మొత్తం మూలధన వ్యయం 2024 - 25లో రూ.10.18 లక్షల కోట్లు కాగా, ఇది 2023 - 24లో రూ.9.49 లక్షల కోట్లుగా ఉందన్నారు. పన్నుల చర్యలతో సహా దేశీయ డిమాండ్‌ను పెంచడానికి, తద్వారా దేశీయ వినియోగం, పొదుపులు పెట్టుబడులను పెంచడానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టబడ్డాయని వివరించారు.

## ఎమ్మెల్సీగా పత్రం అందుకున్న బీద రవిచంద్ర



**నెల్లూరు మార్చి 17, ప్రభాతవార్త-వైద్యం** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యులు కోటాలో శాసనమండలి సభ్యులుగా నామినేషన్ దాఖలు చేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర గెలుపు ఏకగ్రీవం అయినట్లు ధృవీకరిస్తూ శాసనమం డలి ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి వనితా రాణి అసెంబ్లీ నందు డిక్లరేషన్(ధృవీకరణ పత్రం) ఫాంను బీదకు అందజేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, మంత్రి నారా లోకేష్‌కి, రాష్ట్ర ప్రభుత్వ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. బీదతో పాటు ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఉమ్మడి నెల్లూరు జిల్లా శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్, నెలవల విజయశ్రీ ఉన్నారు.

## నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ వారాంతపు సమీక్ష సమావేశం



**నెల్లూరు కార్పొరేషన్,మార్చి 17 ప్రభాతవార్త:** సమీక్ష సమావేశంలో భాగంగా కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో సోమవారం ఇంజనీరింగ్, హౌసింగ్, టిడ్కో విభాగాల వారితో మీటింగ్ నిర్వహించారు. ఇందులో ఎల్ టి ఇంజనీరింగ్ కంపెనీ వారికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లు వేగవంతముగా కొనసాగేలా చర్యలు చేపట్టాలని ప్రతినిధులకు ఆదేశాలు ఇచ్చారు .అలాగే మెగా ఇంజనీరింగ్ వారికి నగర ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందజేయుటకు గాను పాత కనెక్షన్ల ద్వారా కాకుండా నూతన జోనల్ విధానం ద్వారా నీటి సరఫరాను పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి ఆప్షన్ మూడు నుంచి ఒకటికి అదనపు ఫైనాన్స్ అసిస్టెన్స్ మంజూరు కొరకు యాప్ ద్వారా అప్లోడ్ చేయవలసిందిగా, అలాగే స్టేజ్ కన్వర్షన్స్ త్వరగా అయ్యేలా, నీటి చార్జీలు నిర్దేశించిన లక్ష్యాలను వసూలు చేయవలసినదిగా ఎమినిటీస్ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ వై. ఓ. నందన్, ఎస్.ఈ రామ్ మోహన్ రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధురాలిపై యువకుడు అత్యాచారయత్నం

**వరికుంటపాడు, మార్చి 17, ప్రభాతవార్త** మండలంలోని ఓ గ్రామంలో ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో 84 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రఘునాథ్ తెలిపిన వివరాల మేరకు వృద్ధురాలు ఒకటే ఇంట్లో ఉండటం గమనించి ఆమెపై అత్యాచారయత్నానికి ప్రయత్నిస్తుండగా ఆమె బిగ్గరగా కేకలువేయడంతో చుట్టు పక్కల వాళ్ళు రావడంతో యువకుడు పరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘునాథ్ తెలిపారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, మార్చి 17, ప్రభాత వార్త:** మండలంలోని సోమశిల జలాశయా నికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 55.230టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి 400, పెన్నా డెల్టాకు 500, కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 97.245 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం

## జాప్యం లేకుండా ప్రజాసమస్యలు పరిష్కరించాలి



- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఆనంద్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 303 అర్జీలు
- అర్జీదారులకు భోజన ఏర్పాట్లపై విశేష స్పందన



**నెల్లూరు, కలెక్టరేట్, మార్చి 17, ప్రభాతవార్త** ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను జాప్యం లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, డ్వామా పీడీ గంగాభవాని, డిపివో శ్రీధర్‌రెడ్డి, జడ్పీ డిప్యూటీ సిఇవో మోహన్‌రావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు.

**అర్జీదారులకు భోజన ఏర్పాట్లపై విశేష స్పందన**

ప్రతి సోమవారం సుదూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వస్తున్న అర్జీదారులకు మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించడం పట్ల విశేష స్పందన లభిస్తోంది. అర్జీదారులకు మధ్యాహ్నం భోజనం అందించాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా గతవారం నుంచి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అన్న క్యాంటీలకు భోజనం అందించే సుభోజన వారు మంచి రుచికరమైన భోజనాన్ని అర్జీదార్లకు అందించారు. దీంతో అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అర్జీలను అందజేసి బయటకు రాగానే మంచి భోజనం అందించడంతో ప్రభుత్వ ఏర్పాట్ల పట్ల అర్జీదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ధాన్యం కొనుగోళ్లలో రైతుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి** జిల్లాలో ధాన్యం ధరలు రోజురోజుకి తగ్గిపోతున్నాయని, దీంతో రైతులు చాలా నష్టపోతున్నారని, వెంటనే రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని అఖిలపక్ష రైతు సంఘం నేతలు జిల్లా కలెక్టర్‌కు ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. మిల్లర్లు పుట్టికి రూ.16500 మాత్రమే ఇస్తున్నారని, తేమశాతం పేరుతో 70కిలోల ధాన్యాన్ని తీసుకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. గత వారం రోజులుగా 20వేల రైతులు ఆరబోసుకుని వున్నారని, గోతాలు లేనందున ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. మిల్లుకు తీసుకెళ్లేందుకు జిపిఎస్ ఉన్న ట్రాక్టర్లు దొరకడం లేదని, జిపిఎస్ ఏర్పాటుచేసుకుని అది యాక్టివేట్ కావడం లేదని చెప్పారు. ఇంకా ధాన్యం ధరలు తగ్గే అవకాశం వుంది. ప్రభుత్వం తరపున రైతుల సమస్యలు పరిష్కరించి రైతులకు మంచి ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌కు విన్నవించారు.

**మాజీ సైనికుల భూములను కాపాడాలని వినతి**

జిల్లాలో మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించిన భూములను కొంతమంది ఆక్రమించి మాజీ సైనికులను ఇబ్బందులు పెడుతున్నట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు మహబూబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చాలా ప్రాంతాల్లో మాజీ సైనికుల భూములను స్థానికులు ఆక్రమిస్తున్నారని, అధికారులు దగ్గరుండి మాజీ సైనికులకు భూములు అప్పగించాలని కోరారు. వెంకటాచలం మండలం చెముడుగుండ గ్రామం కుంకుమపుడి వద్ద దాదాపు 70 ఎకరాలు మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించిందని, ఇందులో కొంత భూమి కబ్జాదారుల చేతుల్లో వుందన్నారు. ఆన్ లైన్, అడంగళ్‌లో కూడా ఇంకా చాలామంది మాజీ సైనికుల పేర్లు నమోదు చేయలేదని, వెంటనే మాజీ సైనికుల భూములకు రక్షణ కల్పిస్తూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు.

**ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 303 అర్జీలు**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 303 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 150, మున్సిపల్‌శాఖకు సంబంధించి 23, సర్వేకు 20, పంచాయతీరాజ్‌శాఖకు 30 అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు మరింత విస్తృత ఏర్పాట్లు

మద్దతు ధర కంటే తక్కువకు కొంటే దళారులు, మిల్లర్లపై కేసులు
కొనుగోలు కేంద్రాల్లో సరిపడ గన్నీ బ్యాగులు, జీపీఎస్ వాహనాలు
రైతులందరూధాన్యంకొనుగోలుకేంద్రాలనుసద్వినియోగం చేసుకోవాలి
రైతులకు సమస్యల పరిష్కారానికి కంట్రోలు రూం నెంబరు 8520879979
జాయింట్ కలెక్టర్ కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 17, ప్రభాతవార్త** జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు మరింత విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ చెప్పారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాలులో ధాన్యం సేకరణపై జేసీ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటుచేసిన 300 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు సుమారు 11వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్లను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలో అధికారులు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తూ అన్ని ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారన్నారు. మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఎవరైనా రైతులను ప్రలోభపెట్టి తక్కువ ధరకు కొనుగోలు చేస్తే వారిపై కేసులు కూడా నమోదు చేస్తున్నామని చెప్పారు. కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఇబ్బందులు ఉండకూడదని మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి అమలు చేసేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. 25వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి 40కోట్ల మేర మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు అందజేసి వున్నారని, ఈ విషయంలో రైతులు ఎలాంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. 3.50 లక్షల గన్నీబ్యాగులు అందుబాటులో వున్నాయని, ధాన్యం సేకరణ ఎక్కువగా వున్న కేంద్రాల్లో గన్నీ బ్యాగులను ముందుగా సిద్ధం చేసి ఉంచుతున్నట్లు చెన్పారు. లారీ, ట్రాక్టర్ అసోసియేషన్లతో సంప్రదించి ప్రస్తుతం ప్రభుత్వం అనుమతించిన రేట్ల మేరకు వాహనాలు సిద్ధం చేసినట్లు చెప్పారు. 250 లారీలు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించేందుకు ఏర్పాటుచేశామని, ఇవి ఎట్టిపరిస్థితిలో జిల్లా దాటివెళ్లకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. వాహనాలను పర్మినెంట్ జిపిఎస్ కాకుండా టెంపరరీ మాగ్నటిక్ జీపీఎస్‌ను ఏర్పాటు చేసేందుకు ఏజెన్సీని ఎంపిక చేసినట్లు చెప్పారు. దీంతో జీపీఎస్ వాహనాల సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందన్నారు. మన జిల్లాలో ధాన్యం కొనుగోలుకు ప్రకాశం జిల్లా నుంచి 10మంది రైసుమిల్లర్లను కొనుగోలు కేంద్రాలకు అనుసంధానించినట్లు చెప్పారు. ఈ మిల్లుల నుండి ఒక్కొక్క మిల్లుకు 500 మెట్రిక్ టన్నులు సేకరించేలా ప్రతిరోజూ 5000 మెట్రిక్ టన్నుల లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. ఇంకా ఇతర జిల్లాల నుంచి ఆసక్తి గల మిల్లర్లను అనుసంధానిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 నుంచి 48 గంటల్లోనే డబ్బులను కూడా ప్రభుత్వం రైతుల ఖాతాలకు జమచేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 50శాతం కోతలు పూర్తయ్యాయని, మరో రెండువారాల్లో మరో 50శాతం కోతల పూర్తికానున్న నేపథ్యంలో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా వుందని చెప్పారు. రైతులకు సంపూర్ణ సహకారం అందిస్తూ కొనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, రైతులందరూ దళారుల ప్రలోభాలకు లొంగకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో కొనుగోళ్లకు సంబంధించి రైతుల సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం నెంబరు 8520879929ను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి అంకయ్య, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ అర్జున్‌రావు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో నీటి సమస్యకు పరిష్కారం



**కొడవలూరు మార్చి17 ప్రభాతవార్త** కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో ప్రజల నీటి సమస్యకు పరిష్కారం దొరికింది. కొడవలూరు మండలంలోని పాతవంగల్లు పంచాయతీ వడ్డిపాలెం గ్రామంలో ప్రజలు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ పైపులు,తాగునీటి పైపులు ఒకే ప్రాంతం నుంచి వెళ్లడంతో తాగునీటి పైపులు డ్యామేజ్ అయ్యాయి. దాంతో డ్రైనేజీ నీరు తాగు నీటితో కలవడం వల్ల గ్రామస్తులు తీవ్రఇబ్బందులు పడేవారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సత్వరమే స్పందించి గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. దాంతో స్పందించిన అధికారులు సోమవారం డ్రైనేజీ వెళ్లేందుకు ప్రత్యేక పైపులు ఏర్పాటు చేశారు. తాగునీటి పైపులకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. దాంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యపై వెంటనే స్పందించి పరిష్కరించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఆర్‌టిసి బస్టాండ్‌లో పట్టపగలు సెల్‌చోరీ

**కావలి, మార్చి17 ప్రభాతవార్త :** కావలి ఆర్‌టిసి బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా కావలికి చెందిన బొమ్మిశెట్టి పవన్‌కుమార్ సెల్‌ను (శామ్‌సంగ్ ఎఫ్55) సోమవారం గుర్తుతెలియని దుండగుడు చోరీ చేశాడు. బాధితులు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. తరచుగా కావలి ఆర్‌టిసి బస్టాండ్‌లో చోరీలు జరుగుతున్నాయని ప్రయాణీకులు వాపోతున్నారు. బస్టాండ్ ఆవరణంలో పోలీసు నిఘా ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధులు విలువైన సూచనలను అందించండి

### ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్,మార్చి 17 ప్రభాతవార్త:** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నగర నియోజకవర్గం 117 నెల్లూరు సిటి పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి విలువైన సూచనలను ఆహ్వానిస్తున్నామని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సూర్యతేజ తెలిపారు కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ.ఆర్.ఓ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి వివిధ అంశాలపై తగు చర్యలు తీసుకోవడానికి ఈరోజు సమావేశం నిర్వహించినట్లు తెలియజేశారు. ఎస్ ఎస్ ఆర్ 2025 ఎలక్టోరల్ రోల్ సవరణలపై చర్చలు జరిపేందుకు ఎన్నికల సంఘం చట్టపరమైన, అధికారుల జవాబుదారీతనానికి కట్టుబడి ఉందని వివరించారు. ఎస్ ఎస్ ఆర్ 2025 కి సంబంధించి పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై పరిష్కారం అందించామని తెలిపారు. ఈసీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు సెలవులో ఉన్నట్లయితే లేదా బదిలీ అయినట్లయితే ఆ పోలింగ్ స్టేషన్‌లను గుర్తించి తక్షణమే ప్రత్యామ్నాయ బి.ఎల్.ఓ లను నియమించాలని నెల్లూరు అర్బన్ తహశీల్దార్‌ను ఆదేశించారు.పోలింగ్ స్టేషన్లలో 800 నుండి 1400 మంది ఓటర్లు ఉండేలా మరియు ప్రతి ఓటరు వారి నివాసానికి 2 కి.మీ.లోపు ఉండేలా పోలింగ్ స్టేషన్లు చేపట్టబడతాయని, ఓటర్లను పోలింగ్ స్టేషన్‌లకు తరలించడం ద్వారా పోలింగ్ స్టేషన్‌లను హేతుబద్ధీకరించేందుకు వచ్చే రెండు నెలల్లో సమగ్ర కసరత్తు చేపట్టనున్నట్లు వివరించారు.ఓటరు జాబితాలో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే క్రమంలో ఉండేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు.నియోజకవర్గంలో రాజకీయాల ద్వారా నియమించబడిన బి.ఎల్.ఏలు తమ సంబంధిత బి.ఎల్.ఓలకు అందుబాటులో ఉండాలని, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత పోలింగ్ స్టేషన్‌ల జాబితాలలో సహాయం అందించాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలోని బీ.ఎల్.వోలందరికీ శిక్షణా సమావేశాలు నిర్వహించనున్నామని తెలిపారు.ఈ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి సిహెచ్ ధనుంజయ్, తెలుగుదేశం పార్టీ నుంచి చాట్ల నరసింహారావు, ఎస్ కే. ఇంతియాజ్, మామిడాల మధు, యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్ ప్రవీణ్ కుమార్, జనసేన పార్టీ నుంచి ఎస్.కె ఆలియా, ఎస్ అజయ్ బాబు, ఎం. హైమావతి, భారతీయ జనతా పార్టీ నుంచి టి. నవీన్ కుమార్, ఎం. రాజేష్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి కత్తి శ్రీనివాసులు, బహుజన సమాజ్ పార్టీ నుంచి బి. శ్రీరామ్, 117 నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్,నెల్లూరు అర్బన్ఎన్నికలడిప్యూటీ తహశీల్దార్,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పది పబ్లిక్ పరీక్షలు



**నెల్లూరు,మార్చి17 ప్రభాతవార్త-విద్య** సోమవారం జిల్లా వ్యాప్తంగా 174 పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైయ్యాయి. తొలిరోజు పరీక్షలకు 28496మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 28492మంది హాజరైయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరైయ్యారు. అలాగే ప్రయివేట్ విద్యార్థులు 734మంది హాజరు కావాల్సి ఉండగా 354మంది హాజరైయ్యారు. 380మంది గైర్హాజరైయ్యారు. నగరంలోని స్థానిక ఈఎస్ఆర్ఎం కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ పరిశీలించగా జాయింట్ కలెక్టర్ కార్త్తీక్ మరికొన్ని కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్నీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షల నిర్వహణను విజయవంతం చేయ్యాలన్నారు. ఈ పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా పటిష్ట చర ్యలు తీసుకోవటం జరిగిందన్నారు. కాగా జిల్లా స్దాయి పరిశీలకు జిల్లాలోని7 కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ 67 కేంద్రాలను , తనికీచేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ బీదాకు గూడా అభినందనలు



**వింజమూరు, మార్చి17, ప్రభాతవార్త :** ఎమ్మెల్సీ బీద రవిచంద్రను నెల్లూరులో వింజమూరు మండలం తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు గూడా నరసారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్దికి కృషి చేయగలరని కోరారు.

## 30వేలు ఆర్థిక సాయం అందజేస్తున్న 'కంచి'



**ఆత్మకూరు, మార్చి17, ప్రభాతవార్త:** ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల మృతి చెందిన మూడు కుటుంబాల సభ్యులకు శ్రీ సాంబశి చారిటబుల్ ట్రస్ట్ అధినేత, నిత్యాన్నదాత కంచి పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యం లో ఒక్కొక్కరి 10వేలు వంతున మొత్తం 30వేలు నగదును అందజేశారు. సంవత్సరంకు పైగా ఆత్మకూరు పట్టణంలో మృతిచెందిన వారి కర్మకాండల ప్రక్రియ కోసం ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఆత్మకూరు పట్టణంలోని3 వార్డు పరిధిలోని సయ్యద్ రహతున్నీసా, 13వ వార్డు పరిధిలోని శాగలమూరి రవిచంద్ర, 14వార్డు పరిధిలోని నల్లమేకల మస్తానయ్య, ఈ కుటుంబాలను పరోక్షంగా పరామర్శించిన నిత్యఅన్నదాత పరమేశ్వర్‌రెడ్డి 30వేలు రూపాయలు అందజేశారు. ఆత్మకూరు పట్టణ పేద ప్రజల కష్టాలు తీర్చడానికి నేనున్నానంటూ అండగా నిలుస్తున్నారని ఆయా కుటుంబాల వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్యార్ధులచే విద్యా పర్యటన



**ఉదయగిరి, మార్చి 17, ప్రభాతవార్త :** మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల ఉదయగిరిలో రెండో సంవత్సరం, వ్యవసాయ విద్యార్థులు విద్యా పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ 80 మంది వ్యవసాయ విద్యార్థులతో పాటు తమ సిబ్బంది నలుగురు అధ్యాపకులు నాలుగు రోజుల పాటు ఈనెల 15,16,17, 18న విద్యా పర్యటనకు వెళ్తున్నారని, మొదటి రోజు నెల్లూరులోని వివిధ రకా వరిని, డాక్టర్ పి.వెన్నుల, డాక్టర్ శ్రీలక్ష్మి అలాగే కేవీకే నెల్లూరులో ఉన్న వర్మీ కంపోస్టు న్యూట్రిటెంట్ గార్డెన్, ఫిష్ పాండ్స్ గురించి డాక్టర్ శివజ్యోతి వివరించారు. అలాగే తిరుపతి, కావలి లో గల వివిధ పరిశ్రమలు కృషి విజ్ఞాన కేంద్రాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘం, ప్రగతి యువ కేంద్రం, పరిశోధన సంస్థలకు ఉద్యాన కళాశాలలకు విద్యార్థులు నేర్చుకునే సుసంపన్నమైన అనుభవాన్ని అందించడానికి విద్యా పర్యటనను ప్రతి ఏటా నిర్వహిస్తామని, అలాగే కొన్ని ముఖ్యమైన పరిశ్రమలను పరిశోధన సంస్థలను సందర్శించడం ద్వారా రిఫ్రెష్, అద్భుతమైన అభ్యాస అనుభావాన్ని, అపారమైన జ్ఞానాన్ని పొందవచ్చని విద్యార్థినీ, విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ కళాశాల ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ కిషన్ తేజ, ఫిజికల్‌డైరక్టర్ రమణ లక్ష్మీ ప్రసన్న, లహరి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ క్యాలెండర్ డైరీ ఆవిష్కరణ



**ఉదయగిరి, మార్చి 17, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ఎస్సైలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి శినయ్య చేతుల మీదుగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో క్యాలెండర్ డైరీ ఆవిష్కరణ జరిగింది. ఉదయగిరి పోలీసు స్టేషన్‌లో ఆదివారం క్యాలెడర్ డైరీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఉదయగిరి విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షులు విప్లవ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హైందవ సంస్కృతి సాంప్రదాయాలకు కట్టుబడి ఉండాలని సాంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.

## గండిపాలెంలో సామాజిక తనిఖీ గ్రామసభ

**ఉదయగిరి, మార్చి 17, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని గండిపాలెం పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఎస్ఆర్పీ బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో డీఆర్పీ బొమ్మప్ప పంచాయతీలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం తీరును చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లపల్లి కల్పన, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ కుటుంబాన్ని పరామర్శించిన అసోసియేషన్ నేతలు



**బిట్రగుంట మార్చి 17 ప్రభాతవార్త :** బోగోలు మండలం తెల్లగుంట రేషన్ డీలర్ అయిన షేక్ గౌస్ భాషా ఇటీవల అకాల మృతి చెందారు. గౌస్ బాషా అంత్యక్రియలు లో మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు జంపాని సురేష్ రెడ్డి, ఉపాధ్యక్షులు సి హెచ్. శీనయ్య, ప్రధాన కార్యదర్శి అమీరిశెట్టి సారధి తదితరులు పాల్గొన్నారు. గౌస్ భాషా కుమారుడైన ఫిరోజ్ కలిసి వారి కుటుంబానికి వారికి ధైర్యం చెప్పి రేషన్ షాప్ విషయంలో తోడుగా ఉంది ఆ షాపు ఫిరోజ్ కారుణ్య నియామకం ద్వారా వచ్చే విధంగా కృషి చేస్తామనీ బోగోలు మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం హామీ ఇచ్చింది.

## రైతు సేవా కేంద్రాలపై రైతులకు అవగాహన



**మనుబోలు మార్చి17 ప్రభాతవార్త :** మనుబోలు మండలంలోని అక్కం పేట గ్రామంలో రైతులతో బేటి అయిన మనుబోలు మండల తహసిల్దారు సిహెచ్ సుబ్బయ్య ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించారు .దళారుల ద్వారా ధాన్యాన్ని అమ్మి గిట్టుబాటు ధర లేదని మోస పోవద్దని రైతులకు తెలియజేశారు. ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసా యాధి కారి జహీర్ అక్కంపేట విఆర్ఓ మురళీదర్ పాల్గొన్నారు.

## దళారీల మాయలో ధాన్యం రైతులు



**అల్లూరు, మార్చి 17 ప్రభాతవార్త:** ఆరు కాలాలు కష్టపడి పండించిన ధాన్యాన్ని రెండు రోజులు ఓపిక చేసుకుని ధాన్యం ఆరబెట్టి ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోలేక దళారీల మాయలో తక్కువ రేట్ కి దాన్యాన్ని రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితిలో ఉండటం దారుణమని అల్లూరు వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు అల్లూరు మండలం లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి ఈ పరిస్థితుల్లో రైతులు దళారీ మాటలు నమ్మి ఎటువంటి హామీ లేకుండా వేలమంది రైతులు ఒక పుట్టే ధాన్యాన్ని కేవలం 16,800/- కి విక్రయించడం దారుణంగా ఉందని ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు కల్పించిన రైతులు కొనుగోలు కేంద్రాల లో 19,750/- రూపాయలు ఒక పుట్టి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అధికారులును ఏర్పాటుచేసిన రైతులు ముందుకు రాకపోవటం ఆశ్చర్యంగా ఉందని ఇకనైనా రైతులు ఎటువంటి హామీలేని దళారి మాటలు నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని అల్లూరు మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు .

## మహిళలు, బాలికల భద్రతకు శక్తి యాప్ రక్షణ కవచం

### - జిల్లా యస్.పి. జి.కృష్ణకాంత్



**నెల్లూరు క్రైమ్, మార్చి 17, ప్రభాతవార్త :** మహిళలు, బాలికల రక్షణ కోసం ఉద్దేశించిన శక్తి యాప్ను అందరూ ఉపయోగించుకోవాలని జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్ సూచించారు. స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు శక్తి యాప్ గురించి కరపత్రాలను ఆవిష్కరించి, మహిళలకు స్వయంగా అందజేసి, శక్తి మొబైల్ యాప్ ను స్వచ్ఛందంగా డౌన్లోడ్ చేసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ప్రభుత్వం మహిళల భద్రత కోసం ఏర్పాటుచేసిన శక్తి యాప్ ప్రతి మహిళ తప్పక డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. శక్తియాప్ డౌన్లోడ్ చేసుకోవడం వల్ల విపత్కర పరిస్థితులలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రక్షిస్తారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించి, వారి మొబైల్స్‌లో యాప్‌ను నిక్షిప్తం, రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశించారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ ఏవిధంగా పని చేస్తుందన్న విషయాన్ని మహిళలకు క్లుప్తంగా వివరించాలని సూచించారు. సమాజంలో వివిధ రకాల నేరాలు జరిగినప్పుడు వెంటనే శక్తి యాప్ తో పాటు 100, 112, 1930, 1972, 1098 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించిన యెడల ఆపదలో ఉన్న వారికి పోలీసులు అండగా నిలుస్తారని తెలిపారు.

## ఆటోలకు లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు



**కోవూరు, మార్చి 17 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని ఏ గ్రామంలో అయినా ఆటోలకు లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసి తమ ఇష్టానుసారంగా పాటలు పెట్టి ఇబ్బందులు పెట్టే ఆటోలపై కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సోమవారం ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు ఆయన ఆటోలను పరిశీలించి స్పీకర్లు పెట్టి ఉన్న ఆటోలను గుర్తించి వాటిని తొలగించి ఆ స్పీకర్లు పనిచేయకుండా తగు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా యూనిఫారం ధిరించడమే కాకుండా లైసెన్సులు కలిగి ఉండి ఆటోలో ఎటువంటి స్పీకర్లు ఏర్పాటు చేయకూదని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. నిబంధనలు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే వాటిని ఖచ్చితంగా తొలగించడం జరుగుతుందన్నారు.

## ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభం





**కోవూరు, మార్చి 17 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పదవ తరగతి పరీక్షలు ప్రారంభం రోజు కావడంతో అన్ని కేంద్రాల వద్ద విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల హడావిడి కూడా ఎక్కువగా కానవచ్చింది. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. ప్రతి పరీక్షా కేంద్రం ప్రాంగణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో సిద్ధంగా ఉన్నారు. కోవూరు మండలంలోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, జేబీఆర్ ప్రభుత్వ పాఠశాల , సెయింట్ పాల్స్ ఆంగ్ల మాద్యమ పాఠశాల , వశిష్ట ఆంగ్ల మాద్యమ పాఠశాలన్యూలిటిల్ ఫ్లవర్ ఆంగ్ల మాద్యమ పాఠశాల , ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 6కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు ప్రారంభం అయ్యాయి. మొత్తం ఈ పరీక్షలకు 858 మంది హాజరు కావాల్సి ఉండగా.. 854మాత్రమే హాజరయ్యారు. 4 మంది ఈ పరీక్షకు హాజరు కాకపోవడం గమనార్హం.

## సియం సహాయనిధి పేదల ఆరోగ్యానికి రక్ష



**రాపూరు, మార్చి17ప్రభాతవార్త :** సీయం సహాయనిది ద్వారా పేదల ఆరోగ్యానికి రాష్ట ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రక్షణ కల్పిస్తున్నట్లు పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం తానంచర్ల లోని చెన్ను గార్డెన్స్‌లో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు సిద్దవరం గ్రామానికి చెందిన తురిమెర్ల పెంచలయ్యకు రూ.90.953 సియం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లబ్ధీదారునికి ఆరోగ్యం సరిగా లేక ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందడం జరిగిందన్నారు. అయితే అక్కడ పెద్ద మొత్తంలో వైద్యానికి ఖర్చు కావడంతో ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధికి ధరఖాస్తు చేసుకోగా అతనికి వైద్య చికిత్సల ఖర్చు నిమిత్తం రూ. 90.953 రూపాయిలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈయన వెంట టిడిపి నాయకులు నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, మాజీ యంపీపీ పెంచలయ్య, తూమాయి, బోజ్జనపల్లి సర్పంచ్‌లు పైడిపూల చంద్రమోహన్, ఏటూరు నాగభూషణం రెడ్డి, బిసి నాయకుడు పోట్టేళ్ళ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

## మా భూముల జోలికివస్తే ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటాం..!

### రూరల్ మండల గ్రామాల ప్రజలు అల్టిమేటం... ధర్నా...!!



**కావలి, మార్చి17 ప్రభాతవార్త :** మా భూముల జోలికివస్తే ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని కావలి రూరల్ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో సోమవారం కావలి ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా కార్యక్రమం చేపట్టారు. కావలి రూరల్ మండలంలోని ఆనెమడుగు, మొండిదిన్నెపాలెం, కట్టకిందపాలెం, బైనేటివారిపాలెం, ఆకుతోట గ్రామాల్లోని రైతులు, వ్యవసాయకార్మికులు, గీతకార్మికులు ఈ ధర్నాలో పాల్గొని పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం చేశారు. ఈ గ్రామాలలోని ప్రజల అభిప్రాయాలు సేకరించకుండా భూములు లాక్కోవాలని 91 డిక్లరేషన్ ప్రకటించడంపై వారు ఆగ్రహించారు. ధర్నా దగ్గరకు ఆర్డీఓ వచ్చి వినతిపత్రం తీసుకునేదాక గ్రామస్తులు బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో ఆర్డీఓ వంశీకృష్ణ ఆందోళనకారుల దగ్గరకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. మా భూములు తీసుకునేదిలేదని మాట ఇచ్చేంతవరకు ఇక్కడినుంచి కదిలేదిలేదని గ్రామస్తులు భీష్మించుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయకార్మికసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. కావలికి కూతవేటుదూరంలో ఉన్న గ్రామాల్లో సంవత్సరానికి 3 పంటలు పండే భూములమీద 1200ల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. 400ల కల్లుగీత కుటుంబాలు, 300ల మంది పాడిమీద ఆధారపడి జీవించేకుటుంబాలు ఉన్నాయన్నారు. ఇటువంటి సారవంతమైన భూములు లాక్కొని వారి కడుపుకొట్టడం బాధాకరమన్నారు. 2013 సంవత్సరంలో భూసేకరణ చట్టం ప్రకారం బహుళపంటలు పండేపంటలు తీసుకోకూడదని గ్రామసభలోపెట్టి అభిప్రాయసేకరణ తీసుకోవాలని, 80శాతం ఆమోదం పొందాలని చట్టంలో ఉందన్నారు. అయితే, అధికారులు ఆ చట్టాన్ని తుంగలోతొక్కి ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రజలకు సంబంధంలేని పత్రికల్లో ప్రకటనలిచ్చి భూములు లాక్కోవాలని చూడడం దుర్మార్గమన్నారు. పచ్చనిపైర్లతో, పాడిపంటలతో కళకళలాడుతున్న గ్రామాలను పారిశ్రామికవేత్తల లాభాలకోసం భూములను దౌర్జన్యంగా లాక్కొని రైతులు, వ్యవసాయకార్మికులు, గీతకార్మికుల కడుపులు కొట్టడం దారుణమన్నారు. ఈ భూసేకరణ ఉపసంహరించుకోకపోతే మార్చి 25 తర్వాత ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరికలు చేశారు.

**-ఇది నా పరిధిలో లేదు... ఆర్డీఓ వంశీకృష్ణ...**

ఇది తన పరిధిలోలేదని పై అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు తెలియచేసి సమస్యను పరిష్కరిస్తామని కావలి ఆర్డీఓ వంశీకృష్ణ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ ధర్నా, బైఠాయింపు, ముట్టడి కార్యక్రమంలో వ్యవసాయకార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మంగళ పుల్లయ్య, జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, రాష్ట్ర కమిటి సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి, మండల కార్యదర్శి రాధాకృష్ణయ్య, రైతుసంఘం నాయకులు గడ్డం మాల్యాద్రి, వ్యవసాయకార్మికసంఘం నాయకులు తుమ్మల వెంకయ్య, రైతులు గుడిపల్లి వెంకటరావు, తుళ్లూరు వెంకటరావు, కె.వెంకటరావు, ఉప్పల సురేష్, ఉప్పల వెంకటరమణయ్య, రేపాల జయరామిరెడ్డి, రాంప్రసాద్, బొమ్మిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఈ గ్రామాలలోని రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర విజయవంతం కావాలి
## మున్సిపల్ కమీషనర్‌ను కలిసిన ఎల్డర్స్‌క్లబ్ సభ్యులు



**కావలి, మార్చి17 ప్రభాతవార్త :** స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతం కావాలని, ఎల్డర్స్‌క్లబ్ సభ్యులు పాలుపంచుకుంటారని కావలి మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌కుమార్‌కు తెలిపారు. సోమవారం కావలి మున్సిపల్ కార్యాలయానికి ఎల్డర్స్‌క్లబ్ సభ్యులు కమీషనర్‌ను కలిసి ఆయనను దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కావలి పట్టణంలో ఎక్కడా ఎలాంటి కార్యక్రమం జరిగినా ఈ క్లబ్ సభ్యులందరిని భాగస్వామ్యం చేయించగలమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్డర్స్‌క్లబ్ గౌరవ అధ్యక్షులు దుగ్గిశెట్టి బాలయ్య, అధ్యక్షులు జెబిఎం నాయుడు, ఉపాధ్యక్షులు చాకలికొండ శారద, కె.గోపికృష్ణ, మాజీ అధ్యక్షులు పిఐ.జాఫర్‌ఖాన్, కోశాధికారి ఎఈసి విద్యాసాగర్, పి.బాబురావు, విసిహెచ్ వెంకటేశ్వర్లు, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.రామచంద్రయ్య, ఎం.మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుల భూములని కాపాడండి ఆర్ పి ఐ జిల్లా అధ్యక్షులు మాబు



**నెల్లూరు కలెక్టరేట్, మర్చి 17, ప్రభాతవార్త :** మాజీ సైనికులకు కేటాయించిన పొలాలను కబ్జాల చెర నుంచి కాపాడమని జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందించిన ఆర్ పి ఐ జిల్లా అధ్యక్షులు మాబు మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించిన పొలం స్థలాలను కొంత ఆయా ప్రాంతాలలో స్థానికులు కబ్జా చేసి మాజీ సైనికుల, వాళ్ళ కుటుంబ సభ్యులను రానివ్వకుండా ఇబ్బంది పెడుతూ అడ్డుకుంటున్నారని వారి చెర నుంచి కాపాడాలని వారి పొలాలు ప్రభుత్వమే దగ్గరుండి సైనికులకు అందచేయాలని కోరారు. వెంకటాచలం మండలం చెముడు గుంట గ్రామం కుంకుమపుడిలో సర్వే నెంబర్., 30.31.35.36.48.లో దాదాపు 70 ఎకరాలు మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించి ఉన్నారు. అందులో కొంత పొలం కబ్జాదారుల చేతులలో ఉన్నది దాన్ని ప్రభుత్వమే దగ్గరుండి వారికి కేటాయించాలని కోరుతూ ఇంకా వెంకటాచలం మండలం దగదర్తి మండలం కావలి డివిజన్ జిల్లాలో పలు మండలాల్లో మాజీ సైనికులకు పొలాలు కేటాయించి ఉన్నారు కొంతమేరకు కబ్జాల చెరలో ఉన్నాయి మాజీ సైనికులకు ప్రభుత్వమే చొరవ తీసుకొని దేశం కోసం పోరాడిన సైనికులకు దగ్గరుండి పొలాలను అందచేయాలని వారి సంక్షేమం కోసం పాటుపడాలని వేడుకుంటున్నాము. ఆర్‌సి. ఈ 1.6666 తి/78 ఉత్తర్వులు ప్రకారం 14 మందికి 42 ఎసి ఆర్‌సి.ఈ1.6666/75 ప్రకారము 18 మందికి.64 ఎసి అప్పటి నెల్లూరు మండలం తహసిల్దార్ ప్రొసీడింగ్స్ ఇచ్చి వున్నారు. గతంలో పట్టాలు ఇచ్చి శిస్తులు చెల్లించిన వారికి రికార్డులు ఇమ్మిమెంటేషన్ కాలేదు అని మాజీ సైనికులు వాళ్ళని , ఆన్లైన్లో. అడంగళ్ నందు పేర్లు నమోదు చేయలేదు. సదరు విషయాలు పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేయవల సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బత్తల మధు దుంపల సుబ్బారావు. ఆర్ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు దక్కా చిరంజీవి. యు మాలకొండయ్య. నిమ్మల సుబ్బయ్య. ధనుంజయ. తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత రైతుకూలి సంఘం కలెక్టరేట్ వద్ద ధర్నా




**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 17, ప్రభాతవార్త :** దళితతిక్రమణలో వున్న ప్రభుత్వ భూములపై అక్రమంగా పెట్టిన నిషేద బోర్డులను తొలగించి దళితుల భూములకు యాజమాన్య హక్కుకల్పించాలని, అఖిలభారత రైతు కూలీ సంఘం సోమవారం కలెక్టోంట్ ఎదుట ధర్నా నిర్వహిం చారు. అఖిల భారత రైతుల కూలీ సంఘం జిల్లా అధ్యకుడు పొలయ్య డిమాండ్ చేసారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సైదాపురం మండలం, ఉటుకూరు గ్రామంలో దళితుల ఆక్రమణలో వున్న ప్రభుత్వ భూములపై అక్రమంగా పెట్టిన నిషేద బోర్డులను తొలగించి దళితుల భూములకు యాజమాన్య హక్కు కల్పించాలని, భూస్వాములు, పెత్తందారుల ఆక్రమణలో గల ప్రభుత్వ, బంజర, మిగులు, పోరంబోకు భూములను దళితలకు ఇతర పేదలకు పంచి పట్టాలు ఇవ్వాలని, వదలు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయము వద్ద ధర్నా చేసి జిల్లా కలెక్టరుకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఆ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలయ్య మాట్లాడుతూ పోరాటాల ద్వారానే భూస్వాములు, పెత్తందారుల ఆక్రమణలో గల ప్రభుత్వ, బంజర, మిగులు, పోరంబోకు భూములను స్వాధీనం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలో దళితుల పై పోలీసుల వేదింపులు, భూ ఆక్రమ ణలు అధికార పార్టీ అండదండలతో ఎదేచ్ఛగా కొనసాగుతున్న వాటిని అరికట్టడంలో కూటమి ప్రభు త్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఉటుకూరు గ్రామములో వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీకి గ్రామ సర్వే నెం. 359పి1లో 60 ఎకరములు ప్రభుత్వ భూమిని మైనింగ్ లీజుకు కొరకు అప్లై చేసుకున్నా రన్నారు. ఇంకా ఇ.సి. కుడా పెండింగ్ లో వుందన్నారు. ఈ నేపథ్యంలో సర్వే నెం. 359పి2 లో 50 ఎకరములు ప్రభుత్వ భూమిని దళితులు భూమిని ఆక్రమించి చెట్టు పుట్ట తొలగించే క్రమములో పోలీసు వారు దళితులను భూమిలోనికి వెళ్ళనివ్వకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. మరోవైపున సైదాపురం తహశీల్దారు వాడు దళితుల ఆక్రమణలో వున్న ప్రభుత్వ భూములపై నిషేధ బోర్డులు పెట్టి దళితులను భూమిలోనికి వెళ్ళనివ్వకుండా చేస్తున్నారు, అదే సర్వే నెంబరు గల ప్రభుత్వ భూమిలో భూస్వాములు, పెత్తందారుల, ప్రభుత్వ అధికారులు అక్రమంగా 10 ఎకరముల చొప్పున ఆక్రమణ చేసి వ్యవసాయం చేస్తుంటే ఆ భూముల పై నిషేద బోర్డులు పెట్టకుండా వారికి వ్యవసాయం చేసుకొనే అవకాశం కల్పించడం దారుణమన్నారు. వెంటనే జిల్లా కలెక్టరు స్పందించి అక్రమంగా పెట్టిన నిషేద బోర్డులను తొలగించి దళితుల భూములపై దళితులకు యాజమాన్య హక్కు కల్పించాలని, భూస్వాములు, పెత్తందారుల ఆక్రమణలో గల ప్రభుత్వ, బంజర, మిగులు, పోరంబోకు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని భూమి లేని నిరుపేదలకు భూమిని పంచి పట్టాలు ఇవ్వాలని అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు పందిటి వెంకటయ్య, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యకులు కె. రమేష్. ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు బి. మమత, పి. అనూష, ఎ. నాగమణి మరియు నాయకులు పిసి. పిండలయ్య, పి. కోటయ్య, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఏవీఐ బయో కేర్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 17, ప్రభాతవార్త :** ఆర్ఎంపి, పి.ఎం.పి ,గ్రామీణ వైద్య సేవలు అందించి వారికి బయో మెడికల్ వేస్ట్ పట్ల అవగాహణ కలిగించుచూ, బయె మెడికల్ వేస్ట్ సేకరించడం, వీరు వాడు సూదులు, ఇంజెక్షన్ వైయిల్స్, ఇంజక్షన్ అంపీల్స్, ఐ.వి. సెట్స్, ఐ.వి. కాన్యులాస్, మరియు చీము, రక్తముతో కూడిన డ్రిస్సింగ్ వేస్టును వీరి వద్ద నుంచి సేకరించువారు లేనందువలన వీరు వారికి తోచిన విధముగా వాటిని డిస్పోజ్ చేస్తున్నారు. అలా చేయడము వలన మానవాళికి హాని జరుగు అవకాశములు ఉన్నవి. కనుక కలెక్టరు, ఏ వి ఐ బయోకేర్ అను స్వచ్ఛంద సంస్థకి అనుమతి ఇచ్చినచో బయె మెడికల్ వేస్ట్ కాలుష్య నియంత్రణ వారి సూచనల మేర జిల్లా వైద్య అధికారుల పర్యవేక్షణలో మేము బయె మెడికల్ వేస్ట్ సేకరించి తగు జాగ్రత్తలతో వాటిని డిస్పోజ్ చేయగల మని వినతి పత్రం అందించారు.

## మట్టెంపాడు గ్రామంలో సర్వే నెం.3 పై విచారణ జరిపించండి



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 17, ప్రభాతవార్త :** సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమంచర్ల గ్రామ పంచాయితీ రైతులు, రాచమల్లి రమేష్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. నెల్లూరు రూరల్ మండలం, మట్టెంపాడు గ్రామంలో సర్వే నెం.3ఇస్కా భక్తవత్సలరెడ్డి (తహశీల్దారు) వారు మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు వారికి చట్టవిరుద్ధంగా ఇచ్చిన 502 ఎకరములు పట్టాలను రద్దు పరిచిన ఈ భూకుంభకోణం మీద విచారణ జరిపించి మాకు న్యాయం చేయమని ,కలెక్టర్ ఆనంద్ కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినీతి పత్రం అందజేశారు. నెల్లూరు రూరల్ మండలం, మట్టెంపాడు గ్రామ సర్వే నెం. 3 నందు మొత్తం విస్తీర్ణం ఎ. 396 ఎకరములు . ఈ భూములు ఇనామ్ భూములుగా చూపించబడి వున్నవి. మెట్టా రోజ గోపాల్ రెడ్డి 5/6 చెంచురెడ్డి, మరియు వారి కుటుంబం సభ్యులు తాళ్ళపూడి గ్రామం, నెల్లూరు జిల్లా వీరు రిజిష్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.1345/1961 ద్వారా కొనుగోలు చేసియున్నారు. వీరికి అమ్మిన వారు (1) వాడారి వెంకట రమణయ్య 8/వీ. కళ్యాణ సుందరం, హిమయత్ నగర్, హైదరాబాద్ (2) వాదారి రామచంద్రయ్య సన్ ఆఫ్. కళ్యాణ సుందరం, సింద్రి ధన్బాద్ జిల్లా, బీహార్ రాష్టం, (3) కాళహస్తి సుబ్రమణ్యం, సన్ ఆఫ్. వీరరాఘవయ్య, శ్రీరామ నగరం, మద్రాసు, పై ముగ్గురు వ్యక్తుల నుండి మెట్టా రాజగోపాలరెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులు 502 ఎకరములను కేవలం రూ.40,000 లకు కొనుగోలు చేసినారు. వీరి రిజిష్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నందు స్వభావము షెడ్యూలు దాఖలా ఆస్తి మాకు పిత్రాంశము రీత్యా సంక్రమించినవి. మా స్వార్జితపు భూములుగా వున్నవి అని చెప్పి 502 ఎకరములు కొనుగోలు చేసారు. అప్పటి కలెక్టరు, శ్రీకాంత్ ,జానకి, విచారణ జరిపించి తహశీల్దారు భక్తవత్సలరెడ్డి జారీ చేసిన ఆర్డర్‌ను, పట్టాలను అబయన్స్లో పెట్టి పట్టాలను రద్దు పరచమని సి.సి.ఎల్.ఏ. లో కేసు ఫైల్ చేసారు. ఈ భూ కుంభకోణంపై విచారణ జరిపించి దీని వెనుక వున్న వ్యక్తుల మీద తహశీల్దారు భక్తవత్సలరెడ్డి మీద చట్టరీత్యా చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయవలసినదిగా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

## సూపర్‌వైజర్‌గా నీలాంబరి

**లింగసముద్రం, మార్చి 17, ప్రభాతవార్త :** మండలంలోని పెద్దపవని, లింగసముద్రం సెక్టార్లకు సూపర్‌వైజర్‌గా నీలాంబరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సూపర్‌వైజర్ రాధా ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో అప్పటి నుంచి సూపర్‌వైజర్ పోస్టు ఖాళీగా ఉంది. గుడ్లూరు మండలంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న నీలాంబరి బదిలీపై లింగసముద్రం మండలంలో ఉన్న పెద్దపవని, లింగసముద్రం రెండు సెక్టార్లకు సూపర్‌వైజర్‌గా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కట్టా శ్రీనివాసులును కలిసి తన నియామకం గురించి వివరించారు.

